
# పట్టు

- అచరా



"రారా! వెంకటీ" అంటూ ఆప్యాయంగా చేతిలోని బేగ్ తీసుకొన్నాడు రామారావు. కుర్చీలో కూర్చొంటూ వెంకట నారాయణ బూట్లు విప్పుకొంటున్నాడు. రామారావు వచ్చి పక్కన కూర్చొన్నాడు. బాల్య స్నేహితులిద్దరూ కబుర్లలో పడ్డారు.

"ఊరు బాగా మారిపోయిందిరా".

"రాజుగారి ఫేక్టరీ వచ్చిన తరువాత కొంత అభివృద్ధి కనిపిస్తుంది. మన ఊరికి పేరొచ్చింది. ఊరి జనానికి కూలి దొరికింది."

"ఈసారి నువ్వేకదా సర్‌పంచ్‌వి."

"ఇన్నాళ్లకి మనూరికి సర్‌పంచ్ పదవి దక్కింది. పొరుగూరి నాయుడుగారబ్బాయి గట్టి పోటీ ఇచ్చాడు. ఇన్నాళ్లూ ఆడి బాబు ఏలుబడి సాగింది. ఇప్పుడు ఆడు ఏల్దామని చూశాడు. ప్రజలు మార్పు కావాలనుకొంటున్నారు. నేను పసిగట్టాను. రంగంలోకి దిగాను. ఆ వూరికీ మనూరికీ పడదు కదా! ఐనా మనూరి ఓట్లు కొన్ని ఆడికి పడ్డాయి. స్వల్ప మెజారిటీతో గట్టెక్కాను. చాలా డబ్బు కర్చయిపోయింది. నాన్న బెంగెట్టుకున్నాడు. పదింతలు సంపాదించి చేతిలో పోస్తానని మాటిస్తే గాని అన్నం ముట్టలేదు. ఫేక్టరీ రాజుగారు రెండు లక్షలు అప్పుఇచ్చారు."

"ఎంకట్నారాయనా! ఎప్పుడొచ్చినావురా! పిల్లలు బాగున్నారా?" దగ్గుకొంటూ వచ్చాడు అప్పల నరసయ్య.

"బాగున్నారు పెద్దయ్యా! రమేష్ పది చదువుతున్నాడు. పాప ఐదో తరగతి చదువుతుంది."

"నా మనవలూ గూడ బాగా సదువుతున్నారురా అయ్యా!"

"టౌన్‌లో చదువుకొంటున్నారు. శ్రీవాణి నైన్త్. శ్రీకాంత్ ఫోర్త్ స్టాండర్డు చదువుతున్నాడు. ఇంగ్లీషు మీడియమ్" రామారావు గర్వంగా చెప్పాడు.

"నీతోనే సదువుకున్నాడు గాని ఈడికి సదువబ్బలేదు. నాలుగుసార్లు కట్టాడు. పది పాసవలేకపోయాడు. కానిరయ్యా! డబ్బుకి సూడకుండా పిల్లలని పట్నంలో సదివిస్తున్నాడు. నాకు సంతోషంగా వుంది."

ఖాళీ లారీ ఫేక్టరీవైపు వెళ్తోంది.

"ఇదిగో ఈ లారీల దుమ్మొకటి. రేయనక పగలనక తిరుగుతూనే వుంటాయి. నిద్దరలుండడం లేదు." అంటూ మళ్లీ దగ్గాడు ముసలోడు.

"నీకేటి కష్టంవొచ్చింది. పది గంటలకి తొంగుంటే ఆరుకిగాని లెగవు."

"సూడురా అయ్యా ఎలాగంటన్నాడో. తొంగుంటున్నానన్నమాటే గాని నిద్దర పడతాదేటి? ఈదిలో మంచాలేసుకుని తొంగుంటే సుకంగా నిద్దర పట్టీసీది. ఇప్పుడా? ఎన్నెల్లో కతలు సెప్పుకోడాలూ లేవు. పాటలు పాడుకోడాలూ లేవు. నడిరేత్తిరి వరకూ టి.వి. ఏసుక్కూకుంటారు. సీతకాలమైనా పేను తిరగాలిసిందే. పేనాపితే దోమలు కరిసిస్తాయి."

"ఏదో ఘాటుగా వాసన వస్తున్నట్లుంది" అంటూ రుమాలు తీశాడు వెంకటనారాయణ.

"ఫేక్టరీ నుండి అప్పుడప్పుడు ఇలాగే వస్తుంటుంది. మొదటిలో మాకూ ఇలాగే అనిపించేది. అప్పుడు ఇంకా ఎక్కువగా వాసన వచ్చేది."

"ఫేక్టరీలో ఏమైనా మార్పులు చేశారా?"

"అలాటిదేదీ లేదు."

"కంపుకి అలవాటు పడిపోయుంటారు!" ముక్కు చీదుకొచ్చాడు వెంకట నారాయణ.

"నువ్వెప్పుడూ ఇలాగే అంటావులే! ఏకష్టంవూ" లేకుండానే డబ్బులొస్తాయా? అభివృద్ధి జరుగుతుందా?"

"ఈ కంపు మనూరికేనా? చుట్టుపక్కల వూళ్లకు గూడ తగులుతుందా?"

"చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల వరకూ కొంచం తగులుతుందిలే."

"వాళ్లూరుకొన్నారా? కంప్లైంటు చెయ్యలేదా?"

"చెయ్యకుంటా వుంటారటరా? నాయుడుగారి ఊర్లో హైస్కూలుంది. మనం చదువుకొన్నదే. నాయుడుకొడుకు ఎలక్షన్లలో ఓడిపోయాడని చెప్పానుకదా. ఆడు మెల్లిగా మేస్టర్లను దువ్వి గుంటలచేత పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకి కంప్లైంటు తగిలించాడు."

"ఏంటయింది?"

"ఏంటవుద్ది? ఆళ్లకి కాగితాలు, సిరా దండుగు. రాజుగారికి డబ్బులు దండుగు. ఎంక్వయిరీకి వస్తున్నామని బోర్డు నుండి రాజుగారికి ఫోనొచ్చింది. రాజుగారు పదిహేనురోజుల తరవాత రమ్మన్నారు. ఈలోపు హైస్కూలు వార్షికోత్సవం వచ్చింది. ప్రథమ పౌరుడిని కదా ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. రాజుగారిని కూడ పిలవండి. స్కూలు అభివృద్ధికి సాయపడతారన్నాను. పదవ తరగతి పరీక్షలలో ఫస్టు వచ్చిన వాడికి మూడు వేలు, సెకండు వచ్చిన వాడికి రెండు వేలు, థర్డు వచ్చినవాడికి వెయ్యి రూపాయల బహుమతి ప్రతి ఏడూ కంపెనీ తరుపున ఇస్తానని రాజుగారు సభలో ప్రకటించారు. ఇంకా వంద మంది పేద విద్యార్థులకి ప్రతి సంవత్సరం ఒక జత బట్టలు ఇస్తామన్నారు. పదవ తరగతిలో ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించిన సబ్జక్టు టీచరుకి ప్రోత్సాహక బహుమానం. వారం తరవాత పొల్యూషన్ కంట్రోలు బోర్డువాళ్లు ఎంక్వయిరీకొచ్చారు. ఒక్కరు మాట్లాడితే ఒట్టు. శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు."

"ఎప్పుడొచ్చినావురా ఎంకటీ" అంటూ చీరకొంగు... చేతులు తుడుచుకుంటూ బక్కచిక్కిన ముసలిది వచ్చింది.

"ఇప్పుడే వచ్చాను గాని నువ్వేంటి ఇలాగైపోయావు."

"నామాటకేంలే. నాకు వయసయిపోయింది. ఈడి కొడుకు గూడ నాలాగే తయారయాడు."

"మంచి డాక్టరుకెవరికైనా చూపించలేకపోయారా?"

"చూపించానురా, అన్ని టెస్టులూ చేయించాను. ఏ లోపమూ లేదు. వాళ్లకీ అంతుబట్టలేదు."

"అంతుబట్టడానికేటుంటాదిరా బాబూ! అంతా మ... కర్మ! ఈ ఫేక్టరీ వొచ్చింతరవాతే ఇలాగయింది. బస్తా ధాన్యం సునాయాసంగా ఈపుని మోసీసీ వోడిని. ఇప్పుడు పది కేజీల బరువెత్తలేను."

"నువ్వూకోయేసే! ఎప్పుడూ ఒకటే గోల. ఎప్పుడూ పనిసెయ్యలేనూ, పనిసెయ్యలేనూ అంటూ ఒకటే గోల. నీకెవడు పని చెయ్యమన్నాడు. హాయిగా రామా కృష్ణా అనుకొని తిని కూర్చోవచ్చుకదా! తిన్నదరక్కపోతే ఆ రామ మందిరం మీద కూర్చో. ఆళ్లతోపాటు భజన చెయ్యి."

"ఇదీవరసరా ఎంకటీ! నీకినాలని లేకపోతే సెవ్వులు మూసుకో. నేను నా ఎంకటి బాబుతో సెప్తన్నాను. నాను బతికున్నంతకాలం నా కాయకష్టం మీదే బతకాల అనుకున్నాను. ఇప్పుడు నా పనిలాగయిపోయింది. మా అయ్య కర్రూత లేకుండా తొంబై సంవచ్చరాలు తిరిగాడు.

ఒక్క రోజు గూడ పొలంకెల్లకుండా వుండలేదు."

"మీ మాటలకేం గాని, ఎప్పుడూ వుండేవే. నువ్వు రా నాయనా. కొంచం ఒంటిమీద నీళ్లోసుకోని టిపిను తిందువుగాని."

వెంకటనారాయణ లుంగీ కట్టుకొని, భుజం మీద తువ్వాలు వేసుకొన్నాడు. చెప్పులు జత తీసి వేసుకొంటూ "పదరా అలా చెరువుకి వెళ్లొద్దాం" అన్నాడు.

"ఎక్కడికీ వెళ్లక్కరలేదు. లావెట్రీ వుంది."

"అదికాదురా, చెరువులో స్నానం చెయ్యాలి. సబ్బు పెట్టి పట్టుకో!"

"ఏటీ! సెరువులోన తానం సేత్తావా! మా నాయినే! ఆ నాటి కోనేరనుకొన్నావేటి. ఈ రేవునుండి ఆ రేవుకి ఈత కొట్టేడానికి. నీరు పాడయి పోయినాదిరయ్యా. అందులో దిక్కమీ. శర్మం కొరికిత్తాది."

"ఏంటయింది పెద్దీ."

"తానాలకీ, వంటకీ ఆ నీరే వాడుకునీవోల్లం గదా. ఫేక్టీవొచ్చిన కొత్తలో బాగా వుండేది. తరవాత్తరవాత అదేటోగాని పప్పుడికీది కాదురయ్యా! ఏటికెల్లి వంటకి నీల్లు తెచ్చుకునీవోల్లం. రానురాను సెరువు నీల్లు పచ్చగా, పసుపు రంగులోకి మారిపోయినాయి. నీటిలోకి దిగితే ఒల్లు సివసివలాడిపోయింది. వాడిక నీటికిగూడ కరువొచ్చినాది. ఈడు, ఊరికి పెసిడెంటు కదా, ఈడి మీద పడ్డారు ఊరి పెజానీకవంతా!"

"గొప్ప చిక్కొచ్చిందే!" అంటూ రామారావు వైపు చూశాడు వెంకట నారాయణ. దీనికంతటికీ నువ్వే కారణం అన్నట్లున్నాయి ఆ చూపులు.

"ఏ చిక్కూ లేదు. రాజుగారి దగ్గరికెళ్లి విషయం చెప్పాను. నీళ్ల టేంకరు ఏర్పాటుచేశారు. ఉదయం, సాయంత్రం ఏటినీరు ఊళ్లో వాళ్లందరికీ సప్లై చేస్తుంది. నా పరువుతీసి, నన్ను అన్ పాప్యులర్ చేద్దామనుకొన్నోళ్లే అన్ పాప్యులర్ అయిపోయారు. ఒక్క దెబ్బకి రెండు పిట్టలు."


"ఆ బాబు దర్మాన్న నీల్లమోత తప్పింది. మనోణ్ని అందరూ మెచ్చుకునీవోళ్లే! దానికేంగాని ఒకపాలి సెరువు సూసొచ్చీయండి. మల్లీ నువ్వొచ్చీనాటికి సెరువుంటాదో, అక్కడ కోలనీ లెగిసిపోతాదో. బేగొచ్చీయండి. జట్టుగాళ్లిద్దరూ మాట్లాడుకుంటూ కూకుండిపోకండి."

ఇద్దరూ వీధిలోకొచ్చారు.ఊరికి తూర్పువైపున కోనేరు. స్నేహితులిద్దరూ మాట్లాడుకొంటూ వెళ్తున్నారు. ఎదురుగా దుమ్మురేపుకొంటూ లారీ. పక్కకి తప్పుకొన్నారు. రోడ్డు బాగానే వుంది. రామారావు లాభంచేసుకున్నా బాగానే వేయించాడు. రోడ్డుకి ఒక పక్క కాలువ కూడ కట్టించాడు.

"అప్పారావ్! మేం అలాగెల్లొస్తాం. అరగంట తరవాత టిఫిన్ పంపించు. హైదరాబాద్ నుండి నా స్నేహితుడొచ్చాడు. కాలేజీ లెక్చరరు. మనూరేలే. ఇద్దరం కలిసి చదువుకొన్నాం."

"ఫర్వాలేదే! మనూర్లో ఒక హోటల్ గూడ వుందే."

"ఒకటి కాదు. మూడు. బస్సు దిగి ఫేక్టరీకొచ్చే వర్కర్సుంటారు. ఉదయం ఐదుగంటల నుండి టిఫిన్ రడీగా వుంటుంది. అంతే కాదు నాకు పోటీగా మరొక బ్రాందీ షాపుగూడ పెట్టించారు. ఎవరి బేరాలు వాళ్లకుంటాయనుకో."



ఏ చిక్కూ లేదు. రాజుగారి దగ్గరికెళ్లి విషయం చెప్పాను. నీళ్ల టేంకరు ఏర్పాటుచేశారు. ఉదయం, సాయంత్రం ఏటినీరు ఊళ్లో వాళ్లందరికీ సప్లై చేస్తుంది. నా పరువుతీసి, నన్ను అన్ పాప్యులర్ చేద్దామనుకొన్నోళ్లే అన్ పాప్యులర్ అయిపోయారు.

ఊరు చివరికొచ్చారు. ఊరికీ చెరువుకీ ఒక అర కిలోమీటరుంటుంది. పూర్వం బండితోవ. ఇప్పుడు తారు రోడ్డు.

"చెప్పు. ఏం పనిమీదొచ్చావ్?" రామారావు అడిగాడు.

"పొలం అమ్మేయాలనుకొంటున్నానురా. మీ నాన్న వింటే తిడతాడు. అమ్మకి గూడ తెలీనీకు."

"ఇప్పుడు ఇళ్ల స్థలాలకి మంచి రేటుంది. మనూర్లో గూడ ప్లాట్లేస్తున్నారు. నీ భూమి ఎవరు చూస్తున్నారు?"

"సూరయ్య చూస్తున్నాడు గాని రెండు సంవత్సరాలనుండి కొర్రుంచీశాడు. ఏదీ పండించడం లేదు. పంట పండదంటారు. మదుపులు దండుగంటాడు. సిస్తు గూడ ఇవ్వడం లేదు."

"వాడ్నెగ్గొట్టాల. నీ భూమి అమ్మించాల. అవన్నీ నేను చూసుకుంటానులే. నువ్వు వర్రీకాకు. సూరయ్య న్నొకసారి కలు. సిస్తడుగు. ఇస్తే తీసుకో. నీ ఉద్దేశం బయటపెట్టకు. నువ్విప్పుడొచ్చావంటేనే అనుమానిస్తాడు. ఇప్పుడు అందరూ ఇళ్ల స్థలాలకి భూములమ్మేస్తున్నారు. జాగ్రత్తగా మాట్లాడు."

"ఇల్లుగూడ అమ్మేయాలనుకొంటున్నాను."


"ఆ పని మాత్రం చెయ్యకు. ఆ సంచి డాక్టరు ఇప్పుడు ఇంటింటికీ సైకిలేసుకొని తిరగడం లేదు. అతగాడికి అంత తీరిక లేదు. పేషెంట్లు ఎక్కువయారు. నీ ఇంట్లోనే క్లినిక్ పెట్టాడు. అద్దె వంద రూపాయలు పెంచమను."


"పెంచుతాడంటావా?"

"నూటేబై అను. వందకి దిగుతాడు. బాగా ఆర్జిస్తున్నాడు. చేపుతున్నప్పుడే పితుక్కోవాలి. ఆడు ఇల్లు కట్టుకొంటున్నాడు. అది పూర్తయినవరకే నీ ఇంట్లో వుంటాడు."

చెరువు గట్టుమీదకొచ్చారు. చెరువుకి రెండు కిలోమీటర్ల దూరంలో హైవే. బస్సు దిగిన వాళ్లు చెరువులో కాళ్లూ, చేతులూ, ముఖం కడుక్కొని ఊళ్లోకొచ్చే వాళ్లు. కొందరైతే సంతమైల పోవడంకోసం స్నానం చేసిగాని ఊళ్లో అడుగుపెట్టేవారు కాదు. చెరువు నిండా తెల్లతామరలుండేవి. తాను మరికొంత మంది ఈ రేవు నుండి ఆరేవుకి ఈదుతుండే వాళ్లు. ఈతలో తాను ఫస్టు. ఆడవాళ్ల రేవులో పెద్ద చింతచెట్టు. దాని చాటున ఆడవాళ్లు బట్టలు మార్చుకొనేవాళ్లు. తన కౌమార దశకు సాక్షీభూతంగా ఇంకా చింతచెట్టు నిలిచి వుంది. మోడయిపోయి వుంది. వెంకట నారాయణ మనస్సు వికలమైపోయింది.

"రామూ! ఫేక్టరీ రావడంవల్ల కలిగే లాభాలే చూస్తున్నారు మీరు. యువకులకు కూలి దొరికింది. ఆదాయం పెరిగింది. ఖర్చులుగూడ పెరిగాయి. నీటి కోసం గడప దిగవలసిన పని లేదు. పిల్లలకి నగదు బహుమతులు, బట్టలు వస్తున్నాయి. పంచాయితీ ఆదాయం పెరిగింది. రోడ్లు, వీధి దీపాలూ వచ్చాయి. మందుకొట్టులతోపాటు మందులకొట్లు గూడ వెలిశాయి. (మిగతా 27వ పేజీలో)



(19వ పేజీ తరువాయి)

మందులకీ, మందుకీ జీతం చాలడం లేదు. రోగుల సంఖ్యగూడ పెరిగింది. అవసరమైతే ఫేక్టరీ వాళ్లు అంబులెన్సు పంపుతారు.”

మధ్యలోనే అందుకొన్నాడు రామారావు. “పోరుగూరులో ఏటా శ్రీరామనవమి చేస్తారు కదా! ఈ సంవత్సరం రాగుగారే ఏభై వేలిచ్చి ఆర్కెస్ట్రా పెట్టించారు. ఫేక్టరీవాళ్లు ఆగస్టు పదిహేనుకీ, జనవరి ఇరవై ఆరుకీ పిల్లలకి పోటీలు పెట్టించి బహుమతులిస్తుంటారు. కాలేజీ కుర్రాళ్లు క్రికెట్ మ్యాచ్ పెట్టుకొంటామంటే పదివేలిచ్చారు. చుట్టుపక్కల గ్రామాలవాళ్లు ఎవ్వరేదడిగినా ఇస్తున్నారు. ఇప్పుడెవడికీ కంపుకొట్టడం లేదంటేలేదు. ఫేక్టరీ లాభాల్లో నడుస్తుంటే ఇంకా చాలా సదుపాయాలు కల్పిస్తామన్నారు రాజుగారు.” రామారావు చెప్పుకొస్తున్నాడు.

“అదే నేననబోతున్నది. రేప్పొద్దున్న మీకూ రాజుగారికీ ఏవైనా భేదాభిప్రాయాలొచ్చాయనుకో...”

“ఎందుకొస్తాయి. మేమేం బాగారులమా? ఆస్తి తగాదాలున్నాయనడానికి. లేకపోతే ఏవైనా లావాదేవీలున్నాయా?”

“నీకు రెండు లక్షలు ఎలక్షను కర్చులకోసం అప్పుగా ఇచ్చాడన్నావు.”

“అది అప్పన్నమాటేగాని అతనడగడు, నేను తీర్చను. ఐనా అది నా సొంత విషయం. దానికీ ఊరికీ సంబంధమేమిటి.”

“సంబంధం వుంది. నువ్వూ అతనూ బంధువులూ కారు, స్నేహితులూ కారు. ఐనా ఎలాగ తీరుస్తావు. ఎప్పుడు తీరుస్తావు అని అడక్కుండా రెండు లక్షలు ఆలీగా, నోటులేకుండా ఇచ్చాడు. నువ్వు గెలవడం అతనికి ముఖ్యం. నీ ద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేయించాడు. మీ ఇద్దరికీ అభిప్రాయభేదాలొచ్చాయంటే, ఈ సదుపాయాలన్నీ ఆపేస్తాడు.”

*“దానివల్ల అతనికి వచ్చే లాభం?”*

“ప్రజల్లో నీకు చెడ్డ పేరొస్తుంది. నువ్వు శాశ్వతంగా రాజకీయాలకు దూరమైపోతావు.”

“అలాగెన్నటికీ జరగదు” రామారావుకి లోలోపల భయంగానే వుంది.

“సరే అలాగే అనుకొందాం. జనరల్ ఎలక్షనులు వస్తున్నాయి. రాజుగారు సపోర్టు చేసిన వ్యక్తికే మీరు ఓటు వెయ్యాలి. మీకు స్వతంత్రం వుండదు. వ్యతిరేకంగా తిరిగితే ఏమౌతుందో మీ అందరికీ తెలుసు. రెండో పార్టీనుండి మీరు ఏమీ ఆశించలేరు. ఆర్థికంగా గూడ నష్టపోతారు.”

“మేఁవెప్పుడూ రాజుగారి పార్టీయే.”

“మీ వూరంతానా?”

“మునుపటిలాక్కాదు. ఇప్పుడు రాజుగారికి చుట్టుపక్కల వూళ్ల జనాలమీద కూడ మంచి పట్టుంది.” నవ్వుతూ చెప్పాడు రామారావు.

“సరే! రేప్పొద్దున్న నష్టాలొచ్చి ఫేక్టరీ ఊసేసి ఎవరి మట్టుగు వాళ్లు వెళిపోతే ఈ ఊరిజనం పరిస్థితేమిటి? తాగడానికి నీళ్లు వుండవు. పొలం వున్నా పండదు. వేసిన ప్లాట్లు అలాగే వుండిపోతాయి. ఎవరూ ఇల్లు కట్టరు, ఎవరూ కొనరు.”

ఔను ప్లాట్లు కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దాని మీద చాలా పెట్టుబడి పెట్టేశాడు. సంపాదన కోసమే తాను రాజకీయాలలో ప్రవేశించాడు. ఇప్పుడు ఆ పట్టు నుండి తాను బయటకు రాగలడా? రామారావు ఆలోచనలో పడ్డాడు.

“నాణేనికి బొమ్మబొరుసు వుంటాయి. నాణెం విలువ నిర్ణయించేది బొమ్మకాదు. బొరుసు.”

“పద ఇంటికి పోదాం. ఆకలేస్తుంది”. రామారావు సంభాషణను తుంచివేశాడు.

వెంకట నారాయణని ట్రైన్ ఎక్కించి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. అందరూ పడుకుండిపోయారు. భార్య మాత్రం టి.వి. చూస్తూ కూర్చొంది. ఇద్దరూ భోజనాలు పూర్తిచేసి పడుకొనేసరికి అర్ధరాత్రి దాటిపోయింది.

సూర్యుడు ఎర్రగా ఉదయించాడు. క్రమంగా తెల్లబడ్డాడు. కొత్త రూపాయి బిళ్లలాగ ధగధగా వెలిగిపోతున్నాడు. *సూర్యబింబం గుండ్రంగా* వుంది. కాని లోతుకెళిపోయిన సక్కు దవడలు. నీరు లేక ఎండిపోయిన గుంటల్లాంటి రెండు కళ్లు. ఫేక్టరీ గొట్టంలాంటి ముక్కునుండి చీముడు. తెల్లటి పలువరస ఫేక్టరీ కట్టడం లాగుంది. సూర్యుడు భూమి మీదకు దిగాడు. రేకు డబ్బాల్లాంటి పొట్టి కాళ్లు. సీసాల్లాంటి కాళ్లు. రెండు కావు, నాలుగు. కావు. వందకు పైనే వుంటాయి. లేదు లేదు ఇంకా ఎక్కువే. వేలలో వుంటాయి. సరిగ్గా కనిపించడం లేదు. సాగుతున్నాయి. నాగుపాము నాలికలు లాగ, రామారావుకళ్లు నులుపుకొని చూశాడు. ఐనా అంతే. సూర్యుడు దొర్లుకొంటూ వస్తున్నాడు. సూర్యుడు ఆయిల్ టేంకర్. అపాయం. పుర్రె. జనం పరుగెడుతున్నారు. అలసిపోతున్నారు. చెమటలు కక్కుతున్నారు. భయంతో కేకలేస్తున్నారు. రామారావూ అరిచాడు. కాని వినిపించడం లేదు. టేంకరు కింద పడి జనం నలిగిపోతున్నారు. జంతువులు పారిపోతున్నాయి. తోడేలు గురకపెడుతూ నిద్రపోతుంది. ఎక్కడుందో కనిపించదు. గురక వినిపిస్తుంది. గురక ఇంకా గట్టిగా వినిపిస్తుంది. ఇంకా గట్టిగా వినిపిస్తుంది. ఇంకా ఇంకా! రామారావు రెండుచేతులతో చెవులు మూసుకొన్నాడు. తోడేలు ఒక్కసారిగా రామారావు మీద లంఘించింది.

రామారావు ఉలిక్కిపడి లేచాడు. ఒళ్లంతా చెమట. లేచి గ్లాసుడు మంచినీళ్లు తాగాడు. కొడుకు గురక పెడుతున్నాడు. కలలోని తోడేలు గురకలాగుంది. లేపి చూశాడు. పిల్లవాడు స్పృహలో లేడు. రామారావు కాళ్లు ఒణుకుతున్నాయి. భార్య లేచింది. ఇంట్లో అందరూ లేచారు. వీధిలో వాళ్లుగూడ లేచారు. ఫేక్టరీ నుండి అంబులెన్సు వచ్చింది. శ్రీకాంత్‌ని ఐ.సి.యు.లో పెట్టారు.

బలబల తెల్లవారింది. డాక్టరుగారు బయటకువచ్చి రామారావుని పిలిచారు. “సమయానికి తీసుకురాబట్టి గండం గడిచింది. మీ ప్రాంతం నుంచి ఇటువంటి కేసులు తరచు వస్తున్నాయి. రోగం అంతు బట్టడం లేదు. ఎందుకైనా మంచిది పరిశుభ్రమైన వాతావరణంలో కొన్నాళ్లు పిల్లడ్నుంచండి.”

★

**రచయిత చిరునామా:**
**డా. అల్లంసెట్టి చంద్రశేఖరరావు,**
**ఎడిటర్, సవర బులిటిన్**
**మాడుగుల వీధి, పొందూరు,**
**శ్రీకాకుళం జిల్లా- 532168.**

